ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 15 : కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో మీడియా సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ.. పేదల సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులకు ఇంటి స్థలం కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించాల్సిన కేంద్రం ప్రైవేట్ కంపెనీల లబ్ధికోసమే పనిచేస్తుందన్నారు. మోదీ అనుసరిస్తున్న విధానాలతో దేశ ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నం కావడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికవర్గం ఐక్యతతో ముందుకు సాగి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విద్యుత్‌శాఖ డీఈగా రమేశ్‌చంద్ర

మణికొండ : ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజనల్ ఇంజినీర్‌గా ఎం.రమేశ్‌చంద్ర నార్సింగిలోని కార్యాలయంలో మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి డీఈ శివశంకర్ రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డివిజనల్ టెక్నికల్ ఇంజినీర్‌గా బదిలీ అయ్యారు. సైబర్‌సిటీ విజిలెన్స్ విభాగంలో డీఈగా విధులు నిర్వహిస్తున్న రమేశ్‌చంద్ర ఇబ్రహీంబాగ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రమేశ్ చంద్రకు ఏడీలు అంబేద్కర్, రాజేశ్, అసిస్టెంట్ ఇంజినీర్లు నరేందర్, జానీ, మోహినుద్దీన్, దుర్గాప్రసాద్, సంతోష్, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు ఎం.భాస్కర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సారూ..మీరైనా స్పందించండి

- అధ్వానంగా మారిన రహదారులతో తిప్పలు
- వేసిన మూడురోజులకే వెలుగని వీధి దీపాలు

మణికొండ, అక్టోబర్ 15 : కోట్లాది రూపాయల నిధులున్నా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి శూన్యంగానే దర్శనమిస్తోందని, కమీషన్ల కోసమే రోడ్లను వేశారే తప్ప ప్రజల సంక్షేమానికి కాదన్నట్లుగా స్పష్ట మౌతోందంటూ అధికారుల పనితీరుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెక్నాంపూర్, నెమలీనగర్, పుప్పాలగూడ, వెంకటేశ్వర కాలనీ, బాపూ హిల్స్‌కాలనీ, పంచవటి కాలనీల్లో అధ్వాన్న స్థితిలో ఉన్న రోడ్ల పరిస్థితి, వీధి దీపాలు వెలుగకపోవడంపై పలుమార్లు అధికారులకు తెలిపినా స్పందించకపోవడంతో మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూశిపాళ, నాయకులు ధన్‌రాజ్, అందె లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్‌ను కలిసి మణికొండ మున్సిపాలిటీలో రహదారులు, వీధి దీపాల దుస్థితిపై వివరించారు. వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీల్లో రహదారుల పరిస్థితి దారుణంగా మారిందని వివరించారు. చాలాచోట్ల వీధిదీపాలు వెలుగడం లేదంటూ సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని వాపోయారు.

ప్రజాధనం వృథా చేస్తున్నారు..

ఆదర్శంగా ఉండాల్సిన మున్సిపాలిటీలో నాసిరకం పనులను చేపట్టి ప్రజాధనం వృథా చేస్తున్నారంటూ డైరెక్టర్ గౌతమ్‌కు వివరించారు. వీధిదీపాల ఏర్పాటు విషయంలోనే పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని బిగించిన మూడు, నాలుగు రోజులకే పాడైపోతున్నాయని వాపోయారు. మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో అనేక లోటుపాట్లు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని తెలిపినట్లు వెల్లడించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ అందజేసిన ఫిర్యాదులో తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూశిపాళ, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల్ల ధన్‌రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి కీర్తి లతాగౌడ్, వీఆర్‌ఫర్ యూ సహాయోగ్ ప్రతినిధులు అందె లక్ష్మణ్‌రావు, సంగం శ్రీకాంత్, కందడ ప్రవీణ్‌కుమార్, యాలాల కిరణ్, షేక్ అస్పాక్ అలీ, షేక్ ఆరీఫ్, బిన్ని పాల్గొన్నారు.

రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు

దిగులొద్దు.. రాబోయే కాలం మనదే

వ్యవసాయ యూనివర్సిటీ : రాబోయే కాలం బీఆర్ఎస్‌దే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి. కార్తీక్ రెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజక వర్గం శాస్త్రీపురం డివిజన్ నాయకులు ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మనమందరం కలిసి పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని తెలిపారు. స్థానిక సమస్యలు వెనువెంటనే పరిష్కరించేందుకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎండీ ముక్రమ్ ఖాన్, అహ్మద్ పటేల్, ఎండీ హసీఫ్, జాఫర్ పాషా పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం చిరస్మరణీయుడు

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో బీజేఎంసీ కాంగ్రెస్ అధ్యక్షుడు స్థానిక నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, రాంప్రసాద్, శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, శాంతకుమార్, విష్ణు, ప్రేమకుమార్ పాల్గొన్నారు.

- బండ్లగూడ

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసకావద్దు

ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ భిక్షపతిరావు తదితరులు

కాచిగూడ, అక్టోబర్ 15 : యువత, ప్రయాణికులు మారకద్రవ్యాలకు బానిస కావద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటి నార్కొటిక్ డ్రగ్స్ రైల్వే డీఎస్పీ పి. భిక్షపతిరావు కోరారు. డ్రగ్స్‌ను వాడితే కలిగే అనర్థాలపై మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భిక్షపతిరావు, రైల్వే ఇన్‌స్పెక్టర్లు సమ్యానాయక్, ఎల్లప్ప హాజరై మాట్లాడుతూ.. డ్రగ్స్ మాఫియాపై విద్యార్థులు ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికటట్టేందుకు యువత సహకరించాలని తెలిపారు.

అధ్వానంగా సుల్తాన్‌పల్లి - కేబీ దొడ్డి రోడ్డు

వరదదాటికి ప్రమాదకరంగా మారిన రోడ్డు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 15 : సుల్తాన్‌పల్లి – కేబీ దొడ్డి గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డుతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం, సుల్తాన్‌పల్లి – కేబీ దొడ్డి మధ్య కిలోమీటర్ మేర సీసీరోడ్డు నిర్మాణం కోసం 2015లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోటి రూ పాయలు నిధులు కేటాయించి పనులు పూర్తిచేసింది. రెండు గ్రామాల మధ్యలో నుంచి ఎంటేరువాగు ప్రవాహిస్తు ఉంటుంది. వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి హిమాయత్ సాగర్ చెరువులోకి చేరుతుంది. దీంతో నీటిప్రవాహం అధికంగా ఉండడంతో గతేడాది భారీ వరదకు సీసీరోడ్డు దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. సీసీరోడ్డుకు కిలోమీటర్ దూరంలో పలుచోట్ల పగుళ్లు రావడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు పునర్నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

ప్రయాణికుల రాకపోకలకు ఇక్కట్లు

వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేయాలని స్థానికుల వేడుకోలు

రోడ్డును విస్తరించి నిర్మాణం చేపట్టాలి

సుల్తాన్‌పల్లి – కేబీ దొడ్డి మధ్య 2015లో నిర్మాణం చేసిన రోడ్డు ప్రస్తుతం పగుళ్లు వచ్చి దెబ్బతిన్నది. కేవలం 12 ఫీట్ల వెడల్పు ఉండడంతో రెండు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు దెబ్బతిన్న రోడ్డు పునర్నిర్మాణం చేసి రెండు మండలాల ప్రజలు, రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- శివశంకర్, కేబీ దొడ్డి

నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు..

సుల్తాన్‌పల్లి – కేబీ దొడ్డి గ్రామాల నుంచి మొయినాబాద్ మండలంతో పాటు చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు త్వరగా చేరుకునేందుకు ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్, కాశీంబౌలి, ముర్జుజగూడ, బాకారం, నాగిరెడ్డిగూడ, ఎక్కపల్లి, సురంగల్, నజీమ్‌నగర్, కనుకమామిడి గ్రామాల రైతులు పంటలకు శంషాబాద్ మార్కెట్‌కు తీసుకువస్తారు. రెండు మండలాల విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి శంషాబాద్ మండలంలోని పలు పాఠశాలలకు రావడానికి ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. దీంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలకు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామస్తులు వివరిస్తున్నారు. రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. సంబంధిత అధికారులు వెంటనే నిధులు కేటాయించి నూతన రోడ్డు వేయాలని స్థానికులు, ప్రయాణికులు, విద్యార్థులు వేడుకుంటున్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు

మణికొండ మున్సిపాలిటీలోని జయశంకర్ పార్క్‌లోని హైమాస్ట్ లైట్లు నాలుగు నెలలుగా వెలుగక పోవడంతో సమస్యలను గుర్తించిన వీఆర్ ఫర్ సహాయోగ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తమసొంత ఖర్చులతో బాగు చేయించి మంగళవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సంస్థ వారు ముందుకు వచ్చి మరమ్మతులు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. గతంలోనే రహదారుల మరమ్మతులకు బీఆర్ఎస్ నాయకుడు సొంత ఖర్చులతో బాగుచేయించాడంటూ ప్రజలు గుర్తుచేసుకున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

రహ్మత్‌నగర్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్ విజయరావు, జీఎం హరిశంకర్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 15 : సీవరేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం జలమండలి అధికారులు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి పలుబస్తీల్లో పర్యటించారు. డివిజన్‌లో సీవరేజీ కాలువల ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో జలమండలి డివిజన్-6 జనరల్ మేనేజర్ ఎస్.హరిశంకర్‌తో కలిసి పర్యటించి తాగునీరు, సీవరేజీ సమస్యలను పరిశీలించారు. ఓవర్‌ఫ్లో అవుతున్న ప్రాంతాలు, సీసీపీ హాట్‌స్పాట్‌లను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. 40 ఏండ్లక్రితం 2 ప్రధాన, 11 సబ్ లైన్లతో ఏర్పాటు చేసిన నాటి సీవరేజీ వ్యవస్థ పెరిగిన జనాభాకు సరిపోవడంలేదని నిర్ధారణకు వచ్చిన అధికారులు కొత్తలైన్లు వేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యలు తలెత్తకుండా పూడికతీత పనులు చేపట్టాలని.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని విజయరావు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ సూర్యప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వదేశీ మేళా వెబ్‌సైట్ ప్రారంభం

కాచిగూడ, అక్టోబర్ 15 : స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ఆధ్వర్యంలో swadeshi melatelangana.in వెబ్‌సైట్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం బర్కత్‌పురలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తులు, స్థానిక వ్యాపారస్తులను ప్రోత్సహిస్తున్న ఈ వెబ్‌సైట్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్, స్వదేశీ మేళా కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్‌సోని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయడం హర్షణీయం

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15 : దేవాదాయ ధర్మాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషి చేయడం హర్షణీయమని శాఖ జేఏసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాఖలో 11 మందికి సెకండ్ గ్రేడ్, 33 మంది జూనియర్ అసిస్టెంట్‌లకి పదోన్నత్తులు కల్పించారని గుర్తు చేశారు. పదోన్నత్తులు కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపారని అన్నారు.అంతే కాకుండా అర్చక,ఉద్యోగుల ప్రతి సమస్యను తెలుసు కుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తున్నందుకు యావత్ అర్చక, ఉద్యోగుల పక్షాన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అర్చక వెల్ఫేర్ బోర్డు నుంచి అర్చక, ఉద్యోగులకి అతి త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు పలు అవసరాలను తీర్చే విధంగా కృషి చేస్తారని ఆయన ఆకాంక్షించారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

మెహిదీపట్నం : నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను మంగళవారం విజయ్‌నగర్ కాలనీ డివిజన్ కైలాస్‌నగర్‌లో ఉన్న దేవునికుంట శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ హైందవ సమాఖ్య నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ రెండు రోజుల్లో శ్మశాన వాటికను సందర్శించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సాదుగుల రాజేశ్వర్, నాయకులు రాజిరెడ్డి, కుమార్, రామకృష్ణ, యాదయ్య, మహేశ్ పాల్గొన్నారు.

'మానవ అక్రమరవాణా అతిపెద్ద నేరం'

మణికొండ, అక్టోబర్ 15 : మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా, శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా మంచిరేవులలో మంగళవారం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరమని గుర్తుచేశారు. ప్రధానంగా పేద, మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురి అవున్నారని గుర్తుచేశారు. 28 ఏండ్ల నుంచి లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న 28,600 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించడం గొప్పవిషయమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ అవార్డుగ్రహీత డా.సునీత కృష్ణన్ తెలిపారు. ఐసీడీఎస్, పోలీస్, జ్యూడిషియల్, ఎడ్యూకేషన్ డిపార్టుమెంట్ల సహకారంతో పనిచేస్తున్నామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను ఎలా సంప్రదించాలో శిక్షణలో నేర్చుకుంటారని తెలిపారు. లైంగిక వ్యాపారం, అమ్మాయిల పరిస్థితులు, సైబర్ ట్రాఫికింగ్(ఆన్‌లైన్ మోసాలు) ఎలా జరుగుతున్నాయి అనేది వివరిస్తారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కవిత, సీనియర్ కో-ఆర్డినేటర్ సురేశ్‌కుమార్, సూపర్‌వైజర్లు బి.మాధురి, ఎం.జ్యోతి, నీలవేణి పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ

ఫాలూన్ దఫాతోనే మానసిక ప్రశాంతత

మీడియాతో మాట్లాడుతున్న ఫాలూన్ దఫా శిక్షకులు సుబ్రహ్మణ్యం

రవీంద్రభారతి, అక్టోబర్ 15 : మనిషి ప్రశాంతమైన జీవన గమనం ఫాలూన్ దఫా (ఉన్నత మార్గం)తో సాధ్యమని ఫాలూన్ దఫా సాధన శిక్షకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాలూన్ దఫా అంటే ఒక అత్యున్నతమైన సాధన అభ్యాసం అని, విశ్వసూత్రమైన సత్యం, దయ, సహాగుణములను గురించి చేసే ఒక శారీరక, మానసిక ఆధ్యాత్మిక సాధనమని పేర్కొన్నారు. 114 దేశాల్లో 10 కోట్ల మంది ఫాలూన్ దఫాను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఫాలూన్ దఫాను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫా లూన్ దఫాను అభ్యసించి ఆరోగ్యాలను కాపాడుకోవచ్చునని సూచించారు. కర్ణాటక శిక్షకులు భారత్ ఫాలూన్ దఫా ఆసనాలు మీడియా ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించారు.

కార్మికుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబర్15 : హైదరాబాద్ నగర అభివృద్ధి చెందుతూ విస్తరణ పెరిగిందని, దీంతో నల్లా కనెక్షన్లు సంఖ్య చాలా పెరిగిందని దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ వాటర్‌వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కోరారు. యూనియన్ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ నేతృత్వంలో నాయకులు, కార్మికులు మంగళవారం వాటర్ వర్క్స్ ఎం.డి. అశోక్ రెడ్డి కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కార్మికులు, ఉద్యోగుల అనేక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ అడ్వైజరీ మహ్మద్ షఖీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ,చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమరయ్య, నాయకులు అంజయ్య, సత్యనారాయణ,శంకర్, వినయ్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరుల పాల్గొన్నారు.

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాంబాబుయాదవ్

అర్హులందరికీ ఉచిత విద్యుత్ అందించాలి

మారేడ్‌పల్లి, అక్టోబర్ 15: అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత విద్యుత్ పథకం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, సీనియర్ నాయకుడు తెలుకుంట సతీశ్ గుప్త అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకం కంటోన్మెంట్ పేద ప్రజలకు అందకపోవడంతో స్థానిక బస్తీ వాసులు సమస్యను సతీశ్‌గుప్తా దృష్టికి తీసుకొని వచ్చారు. వెంటనే స్పందించిన ఆయన మంగళవారం మారేడ్‌పల్లి ఏడీ విజయ్‌కుమార్, ఏఈ శ్రీధర్‌లను కలిసి సమస్యను వివరించారు. ఉచిత విద్యుత్ పథకం అందని లబ్ధిదారులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేస్తే.. అనంతరం ఉచిత విద్యుత్ సరఫరా అమలవుతుందని ఏడీ విజయ్‌కుమార్ ఆయనకు వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరూ వెంటనే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సతీశ్ గుప్త ప్రజలకు సూచించారు.

డిసెంబర్ 5న సౌత్ స్టార్ రైల్ ప్రారంభం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ రమేశ్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేశ్

రవీంద్రభారతి, అక్టోబర్ 15: కర్ణాటక ఆలయాలను సందర్శించే సువర్ణ అవకాశం టూర్ టైమ్స్ కల్పిస్తున్నది. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ రైలు పథకం కింద తొలిసారిగా ప్రైవేట్ సెక్టార్‌కు చెందిన సౌత్ స్టార్ రైల్ డిసెంబర్ 5న చెన్నైలో ప్రారంభ అవుతుందని టూర్ టైమ్స్ ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ రమేశ్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేశ్ వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్ స్టార్ రైల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ రైల్ 9 రోజుల వ్యవధిలో కర్ణాటకలోని నవబృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హోరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రమణ్యం, మైసూరు, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శించవచ్చునని పేర్కొన్నారు. ప్రతి కోచ్‌లో సీసీ టీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, సెక్యూరిటీ గార్డ్స్ వంటి అనేక రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. భోజన వసతి కూడా కల్పిస్తునట్లు వెల్లడించారు. ఏపీ, తెలంగాణలో ఈ రైలు ఎక్కేందుకు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్లగొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్‌లలో వీలు కల్పిస్తున్నామన్నారు.సీనియర్ సిటిజన్స్‌కు కూడా సబ్సిడీ కల్పిస్తునట్లు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రయాణం కోసం లీవ్ ట్రావెల్ కన్సెషన్(ఎల్టీసీ)ని ఉపయోగించుకోవచ్చునని అన్నారు.స్లీపర్ క్లాస్‌కు రూ. 27,000, ప్యాకేజీ థర్డ్ ఏసీకి రూ.33,000, థర్డ్ ఏసీ ప్రీమియం రూ..37000, సెకండ్ ఏసీకి 40,00తో ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న యాత్రికులు www.traintour.in లేదా 9355021516 నంబర్‌ను సంప్రదించాలి.

27న ఐఎంఏ రాష్ట్ర శాఖ ఎన్నికలు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15 : అల్లోపతి వైద్య రంగంలో అతిపెద్ద ఎన్జీవోగా కొనసాగుతున్న ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖకు ఈ నెల 27న ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఎలక్షన్ కమిషన్ కన్వీనర్ డాక్టర్ ఈ . విజయేందర్ రెడ్డి, సభ్యులు డాక్టర్ పీఆర్ సాయికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్యాంసుందర్. రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ జే విజయ్‌రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ.. దేశంలోనే ఐఎంఏ 4 లక్షల సభ్యత్వం కలిగిన అతిపెద్ద ఎన్జీవో అని అన్నారు. రాష్ట్ర శాఖలో 20 వేల మంది సభ్యులతో 76 శాఖలతో అల్లోపతి వైద్యుల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. కాగా అక్టోబర్ 31వ తేదీతో ప్రస్తుత ఐఎంఏ రాష్ట్ర శాఖ పదవీ కాలం ముగియడంతో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించడం జరిగిన విషయం విదితమే.

ఈ సందర్భంగా ఎన్నికల బరిలో నిలిచే పోటీదారుల ఫైనల్ లిస్ట్‌ను ఆయన విడుదల చేశారు. నేటి నుంచి 26 వరకు అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకునేందుకు సమయాన్ని కేటాయించినట్లు తెలిపారు.అక్టోబర్ 27న కోఠిలోని రాష్ట్ర శాఖ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వర